## పెన్షనర్లను మోసం చేసిన ప్రభుత్వం

**పెన్షన్‌దారుల జేఏసీ ఆగ్రహం**

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా 3 లక్షల మంది పెన్షనర్లను, వారి కుటుంబ సభ్యులను తీవ్ర నిరాశకు గురిచేసిందని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ శుభాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖజానా ఖాళీ అని చెప్పి.. పెన్షనర్లు , ఉద్యోగులకు ఎగ్గొట్టి ఉచితాలకు, వృథా తిరుగుళ్లకు, మూసీ ప్రక్షాళనకు, హైడ్రాకు వేలాది కోట్లు ఎక్కడి నుంచి తెస్తున్నారని ప్రశ్నించారు. స్పెషల్ టీచర్లుగా సేవలందించిన కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లువ్వాలని, పెన్షనర్ల సమస్య పరిష్కారానికి పెన్షనర్ల సంఘాలతో చర్చించి పరిష్కారించాలని డిమాండ్ చేశారు.

## ఆంక్షల నడుమ సమస్యలు చెప్పేదెలా?

- కాంగ్రెస్ ప్రభుత్వంపై టీజీఏపీటీయూ ఆగ్రహం
- నేటి మహాధర్నా వాయిదా

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : తమ సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకుందామంటే పోలీసులు ఆంక్షల పేరుతో వేధించడమేంటని తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ (టీజీఏపీటీయూ) నాయకులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆంక్షల పేరుతో ప్రజల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం టీజీఏపీటీయూ మంగళవారం ఉదయం 10 గంటలకు మహాధర్నాకు పిలుపునిచ్చింది. ఈ మేరకు బీఎంఎస్, టీఎన్‌టీయూసీ, జేఎస్‌పీటీయూ, బీపీటీఎంఎం, టీఆర్‌ఏకేటీయూ, టీపీడీ యూ, ఎన్‌టీపీడీయూ, జీహెచ్‌ఎస్‌వీడీయూ తదితర సంఘాలన్నీ మహాధర్నా నిర్వహించి సమస్యలను సర్కారు దృష్టికి తీసుకెళ్దామని భావించాయి. కానీ, నగరంలో 163 సెక్షన్ విధించడంతో ధర్నా సాధ్యం కాదని భావించి వాయిదా వేసినట్టు యూనియన్ ప్రకటించింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో వాహనరంగ కార్మికులు నరకం చూస్తున్నారని మండిపడింది.



హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మెరుపు ధర్నాకు దిగిన బెటాలియన్ కానిస్టేబుల్‌ను బైక్‌పై అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు



బెటాలియన్ కానిస్టేబుళ్ల ముట్టడి వార్తల నేపథ్యంలో డీజీపీ కార్యాలయం వద్ద భారీగా మోహరించిన పోలీసులు

# సచివాలయం చుట్టూ పోలీసు కంచె

- 508 మందితో భారీ భద్రత
- డీజీపీ కార్యాలయం ముట్టడికీ విఫలయత్నం
- ధర్నాచౌక్‌లో కానిస్టేబుళ్ల మెరుపు ధర్నా

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): ఇప్పటికే ధర్నాలతో దద్దరిల్లుతున్న రాష్ట్రంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. సోమవారం సచివాలయాన్ని ముట్టడిస్తామని తెలంగాణ స్పెషల్ పోలీసు (టీజీఎస్పీ) కానిస్టేబుళ్లు హెచ్చరించడంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. విధుల్లో ఉన్న కొంత మంది బెటాలియన్ కానిస్టేబుళ్లను పక్కన పెట్టి.. ఎక్కడికక్కడే ఏఆర్ సిబ్బందితో నగరం నలువైపులా మోహరించింది. వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే వారిని గుర్తించి అరెస్టు చేసేందుకు బస్సులు, రైళ్లలో, మెట్రో రైలులో తనిఖీలు నిర్వహించింది. ఒక్క సచివాలయం పరిసరాల్లోనే సుమారు 508 మంది పోలీసు సిబ్బందిని డిప్లాయ్ చేసినట్టుగా విశ్వసనీయ సమాచారం. దీంతో ప్లాన్ మార్చిన కానిస్టేబుళ్లు..మెట్రోలో డీజీపీఆఫీసు ముట్టడికి యత్నించారు. బస్సుల్లో, ఆటోల్లో, మెట్రోరైళ్లలో కానిస్టేబుళ్లు డీజీపీ ఆఫీసును ముట్టడించేందుకు విఫలయత్నం చేశారు. లక్డీకాపూల్ మెట్రోస్టేషన్ వద్ద పోలీసులు మోహరించి, అరెస్టు చేసే ప్రయత్నం చేయడంతో మళ్లీ మెట్రోలోనే వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయారు.

**ఇందిరాపార్క్‌లో మెరుపు ధర్నా..**

పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా బెటాలియన్ కానిస్టేబుళ్లు వందలాదిమంది పోలీసుల ముందు ధర్నాచౌక్‌లో మెరుపు ధర్నా చేపట్టారు. పదుల సంఖ్యలో పోలీసుల ఆంక్షలను ఛేదించుకొని తమ నిరసన తెలిపారు. 'టీజీఎస్పీ వద్దు.. ఏక్ పోలీస్ ముద్దు' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అప్పటికే ఇందిరాపార్క్ చుట్టుపక్కల మోహరించిన పోలీసులు వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా, ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ప్రభుత్వ పెద్దల డైరెక్షన్ మేరకు సీరియస్‌గా ఉన్న పోలీసులు.. వాళ్లను ఈడ్చుకుంటూ వెళ్లి వ్యాన్లలో పడేశారు. అనంతరం వారిని స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

## 'భట్టి' దృష్టిలో పడాలని పోలీసుల అత్యుత్సాహం

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని**



బోనకల్లు, అక్టోబర్ 28: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టిలో పడాలనే అత్యుత్సాహంతో కొందరు పోలీసులు విధులను విస్మరిస్తున్నారని, అలా చేస్తే ఆంధ్రాలో ఐపీఎస్‌లకు పట్టిన గతే పడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. సోమవారం ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందాపురం-ఎల్ గ్రామంలో పార్టీ నాయకుడు ఎర్రబోయిన నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి సభలో మాట్లాడారు. నాగేశ్వరరావు వర్ధంతి సభకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విమర్శించారు.

## అంగరక్షకులపైనే అనుమానం?

మొదటిపేజీ తరువాయి...

చుట్టూ 2 కిలోమీటర్ల పరిధి మేర పోలీసు ఆంక్షలు విధిస్తూ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 'ఏక్ పోలీస్ విధానం' నినాదాలతో బెటాలియన్ పోలీసులు, వారి కుబుంబ సభ్యులు మెరుపు ధర్నాలు, ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆందోళన చేస్తున్న వారి కుటుంబ సభ్యులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. సాటి పోలీసు కుటుంబాలకు చెందిన మహిళలు, పిల్లలు అనే కనికరం లేకుండా ఈడ్చుకుంటూ అవతల పారేశారు. ఇది బెటాలియన్ పోలీసులను మానసికంగా తీవ్రంగా కలచి వేసింది. తాజాగా ఆందోళనలకు బాధ్యులుగా గుర్తిస్తూ 10 మంది బెటాలియన్ పోలీసును ఏకంగా విధుల నుంచి తొలగించారు. దీంతో బెటాలియన్ పోలీసులు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం వద్ద అంగరక్షకులుగా ఉన్న బెటాలియన్ పోలీసుల నుంచి తలనొప్పులు వచ్చే ప్రమాదం ఉందని రాష్ట్ర పోలీసు ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించినట్టు తెలిసింది. ఇందులో భాగంగానే పటిష్ట రక్షణ చర్యలు చేపట్టింది. సీఎం ఇంటికి అన్ని వైపులా భద్రతగా 8 ఔట్ పోస్టుల్లో దాదాపు 40 మంది గార్డులు పహారా కాస్తుంటారు. ప్రతి 8 గంటలకు ఒక షిఫ్టు చొప్పున మొత్తం మూడు షిఫ్టుల్లో 24 గంటల నిరంతర భద్రత ఉంటుంది. ఇప్పటి వరకు ఈ భద్రతను టీజీఎస్పీ బెటాలియన్ పోలీసులు చూస్తూ వచ్చారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో రాత్రికి రాత్రే ఇంటి భద్రతా బెటాలియన్ గార్డులను తొలగిస్తూ ఐఎస్‌డబ్ల్యూ నిర్ణయం తీసుకున్నది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి. సీఎం ఇంటి మెయిన్ గేట్ వద్ద, ఆయన కాన్వాయ్ సెక్యూరిటీలో దాదాపు 70 శాతం టీజీఎస్పీ పోలీసులే ఉంటారు. వీరిని వీవీఐపీకి సాధ్యమైనంత ఎక్కువ దూరంలో ఉంచాలని, ముందు వరుస సెక్యూరిటీ వింగ్‌లో ఆర్మ్డ్ రిజర్వ్, గ్రే హౌండ్స్ బలగాలను ఉంచాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది.

## 26 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల విస్తరణ

**ప్రభుత్వం ఉత్తర్వులు**

హైదరాబాద్, అక్టోబర్28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 26 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిని ప్రభుత్వం తాజాగా విస్తరించింది. ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాటిలో ఆదిలాబాద్, జోగులాంబ గద్వాల, కాగజ్‌నగర్, కామారెడ్డి, కొత్తగూడెం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, నిర్మల్, నిజామాబాద్, శాతవాహన (కరీంనగర్), సిద్దిపేట, స్తంభాద్రి(ఖమ్మం), సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, జనగాం, నారాయణపేట, జగిత్యాల, మెదక్, యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, సంగారెడ్డి, నల్లగొండ, వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిని విస్తరిస్తున్నట్టు వెల్లడించింది. త్వరలోనే నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు.

## సచివాలయ సిబ్బందిపై నిఘా

- సచివాలయం చుట్టూ 163 సెక్షన్
- సోషల్ మీడియా పోస్టులపైనా దృష్టి
- చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నుంచి మెమో జారీ

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): బెటాలియన్ కానిస్టేబుళ్ల తిరుగుబాటుతో సచివాలయ భద్రతాధికారులు అప్రమత్తమయ్యారు. సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న టీజీఎస్పీ అధికారులు, కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేస్తూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సోమవారం మెమో జారీ చేశారు. సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బందిపై నిఘా ఉన్నదని హెచ్చరించారు. 'ఏం చేస్తున్నారు..? ఎక్కడికి వెళ్తున్నారు..? ఎవరిని కలుస్తున్నారు..? ఎవరితో మాట్లాడుతున్నారు ? సోషల్ మీడియాలో ఏ పోస్టులు పెడుతున్నారు ? వంటి విషయాల మీద నిఘా ఉంటుంది' అని పేర్కొన్నారు. ధర్నాల్లో పాల్గొనవద్దని, పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో 163 సెక్షన్ అమలులో ఉన్నది కాబట్టి, ధర్నాలు చేయొద్దని కుటుంబసభ్యులకు, బంధువులకు, మిత్రులకు, తోటి సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. సోషల్ మీడియాలో పోలీసులకు వ్యతిరేకంగా పోస్టులు పెడితే తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ 6వ బెటాలియన్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బెటాలియన్ కానిస్టేబుళ్లు

## సస్పెన్షన్ ఎత్తేసేదాకా పోరాటం

**నల్లబ్యాడ్జీలతో బెటాలియన్ కానిస్టేబుళ్ల ర్యాలీ**

డిచ్‌పల్లి/లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 28: ఏక్ పోలీస్ విధానం అమలు కోసం ఆందోళన చేసిన కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ ఎత్తివేసేదాకా పోరాటం ఆపేదిలేదని బెటాలియన్ కానిస్టేబుళ్లు స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌లో సోమవారం కానిస్టేబుళ్లు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 39 మందిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి కమాండెంట్ ఎంఐ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ 6వ బెటాలియన్ వద్ద ఏఈఆర్ పోలీసులు సోమవారం మూడో రోజు విధులకు హాజరుకాకుండా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ కానిస్టేబుళ్లు మాట్లాడుతూ అందరికీ ఒకే రూల్ విధానంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పారని ఆరోపించారు.

## 21 మంది బెటాలియన్ పోలీసుల అరెస్టు

- ధర్నాచౌక్‌లో యూనిఫాంతో నిరసన
- ధర్నాలో ఉన్న వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ

హైదరాబాద్/చిక్కడపల్లి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో సెక్షన్ 163 అమల్లో ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించిన 21మంది బెటాలియన్ కానిస్టేబుళ్లపై డీజీపీ క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. సోమవారం ఇందిరాపార్క్‌వద్ద ధర్నాలో పాల్గొన్న 21 మంది కానిస్టేబుళ్లపై రెండు కేసులు నమోదు చేసి, యూనిఫామ్‌లో డిసిప్లెన్‌ను ఉల్లంఘించారని నోటీసులు జారీ చేశారు. ధర్నా చౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న 21 మంది బెటాలియన్ పోలీసులను అరెస్టు చేసి బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### • 2లక్షల లోపు రుణాలు మాఫీ చేయాల్సిందే



ఎన్నికలకు ముందు రైతాంగానికి ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, రూ. 2లక్షల లోపు రుణమాఫీ చేయాలని ఏఐపీకేఎస్(అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం), రైతు సంఘం, సీపీఐ, ఏఐకేఎస్, అనుబంధ తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ల ఎదుట, బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు.
– బోధన్/ఖమ్మం కమాన్‌బజార్/కొత్తగూడెం అర్బన్

### • ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ఎదుట బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులు బైఠాయించారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ.. పది నెలల నుంచి సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. రేవంత్ వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. – గద్వాల

### • కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన




మిషన్ భగీరథ నీరు రావడం లేదని కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్కే కాలనీవాసులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. 22న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయగా.. మరుసటి రోజు నీరు సరఫరా చేసి ఆ తరువాత నీటి సరఫరా చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ పట్టణంలో 49 వార్డులకు మంచి నీరు సరఫరా అవుతుండగా.. కేవలం 7,8 వార్డులకే ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. – ఎదులాపురం

# పాలనా వైఫల్యం నుంచి బయటపడేదెలా?

- ఇద్దరు మంత్రులతో సీఎం రోజంతా మంతనాలు
- ఏడాది పాలన సంబురాలు, బీఆర్‌ఎస్ నేతల కట్టడిపైనే చర్చ
- ఇప్పట్లో 'మహాలక్ష్మి' అమలు సాధ్యం కాదని తేల్చి చెప్పిన భట్టి
- కేటీఆర్ కేంద్రంగా ఉచ్చు అల్లినా ఫలితంలేకపోయిందని అసహనం
- ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేస్, ఓఆర్‌ఆర్ లీజు అంశాలపై చర్చ

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): పరిపాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించి, ఏడాది పాలనా సంబురాలు ఏ ఆటంకం లేకుండా సజావుగా నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న వనరుల వినియోగం మీద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంతనాలు జరిపినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్రంలో ప్రజలు, పోలీసుల నిరసనలకు బీఆర్‌ఎస్ పార్టీనే కారణమని, ఆ పార్టీని నిలువరించటం ఎలా అనే అంశం మీద చర్చించినట్టు సమాచారం. సోమవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి మంతనాలు చేశారు. ఉదయం 10 గంటలకు ముందుగానే సీఎం ఇంటికి చేరుకున్న భట్టి విక్రమార్కతో సీఎం రేవంత్‌రెడ్డి రెండు గంటలపాటు ఏకాంతంగా మాట్లాడారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వారితో జత కలిశారు. ముగ్గురు కలసి ముఖ్యమంత్రి ఇంటి వద్దనే మధ్యాహ్న భోజనం చేశారు. వారు అధికారిక కార్యక్రమాలకు వెళ్లకుండా పలు అంశాల మీద సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. వచ్చే డిసెంబర్ 7 నాటికి కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరి ఏడాది అవుతుంది. డిసెంబర్ 9న సోనియా గాంధీ పుట్టిన రోజు కావడంతో ఏడాది పాలనా సంబురాలు, పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. సోనియా పుట్టిన రోజును పురస్కరించుకొని ఆరు గ్యారెంటీలలో ఒకటైన మహాలక్ష్మి పథకంలోని కీలక హామీ అయిన మహిళలకు ప్రతి నెలా రూ.2500 భృతిని అమలు చేద్దామా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించగా.. ఇప్పు డు ఆర్థిక పరిస్థితి



ఏమాత్రం బాగాలేదని, మహాలక్ష్మి పథకం అమలు సాధ్యం కాదని తేల్చి చెప్పినట్టు సమాచారం. ఏడాది పాలనా సంబురాల్లో కేవలం ఆర్థికేతర అంశాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని భట్టివిక్రమార్క ముఖ్యమంత్రికి సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం అన్ని వర్గాలు పరిపాలన మీద ఆగ్రహంతో ఉన్నాయని, రూ.2 లక్షల రుణ మాఫీ, రైతు భరోసా అమలు కాకపోవటంతో రైతులు, ఏక్ పోలీసు విధానం అంటూ టీజీఎస్పీ పోలీసులు తలనొప్పిగా మారారని, వారిని బీఆర్‌ఎస్ నేతలే ప్రభుత్వం మీదికి ఉసిగొల్పుతున్నారని చర్చించినట్టు తెలుస్తున్నది. బెటాలియన్ పోలీసు కుటుంబాల మెరుపు ధర్నాను పసిగట్టడంలో రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం విఫలమైందని వారు భావిస్తున్నట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై ఇంటెలిజెన్స్ చీఫ్‌తో దాదాపు 30 నిమిషాల పాటు మాట్లాడినట్టు సమాచారం.

### ఆశించిన కేసులు పెట్టలేకపోయాం

దీపావళి టపాసుల కంటే ముందే పొలిటికల్ బాంబులు పేలుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించిన విషయం ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కేటీఆర్ కేంద్రంగా ఆయన బావమరిది రాజ్ పాకాల ఇంటి చుట్టు అల్లిన ఉచ్చులో అనుకున్న ఫలితాలు సాధించటంలో విఫలం అయ్యామని, ఎస్‌వోటీ పోలీసులకు కాకుండా ఎక్సైజ్ అధికారులకు ఇంత పెద్ద పని అప్పగించటమే ఫెయిల్యూర్‌కు కారణమని బాధపడ్డట్టు తెలిసింది. వారు ఆశించిన స్థాయిలో దాడులు చేయలేకపోయారని, కేసులు పెట్టలేకపోయారని అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అక్కడ జరుగుతున్నది రేవ్ పార్టీ అని ప్రజలను నమ్మించగలిగి ఉంటే పరిస్థితి మరో తీరుగా ఉండేదని అనుకున్నట్టు తెలసింది. దక్షిణ కొరియా టూర్‌లోనే ప్రకటించిన పొలిటికల్ బాంబుల వ్యాఖ్యలు బలంగా జనంలోకి వెళ్లాయని, మీడియా దృష్టి కూడా పూర్తిగా పొలిటికల్ బాంబుల మీదనే ఉందని, మీడియా మూడ్‌ను అదే ట్రాక్‌లో కొనసాగించటం ద్వారా తమ పని చేసుకొనిపోవచ్చని వ్యూహరచన చేసినట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేస్, ఓఆర్‌ఆర్ లీజు అంశాల మీదనే సుదీర్ఘంగా చర్చ సాగినట్టు సమాచారం. ఈ కేసుల పురోగతి మీద మీడియాకు లీకులు ఇవ్వటం ద్వారా బీఆర్‌ఎస్ నేతలను కొంత మేరకు ఆత్మరక్షణలో పడేయవచ్చని, తద్వారా వాళ్ల దూకుడుకు కళ్లెం వేయవచ్చని భావించినట్టు తెలిసింది. అటు మీడియాకు కూడా పూర్తి సమయం వీటితో సరిపోతుంది కాబట్టి ఇప్పుడున్న నిరసన సెగలను సునాయాసంగా కట్టడి చేయవచ్చని అనుకున్నట్టు తెలిసింది.

# ప్రతి మిల్లు సీఎంఆర్ ఇవ్వాల్సిందే

- రెండు రికార్డులు ఉండాల్సిందే
- సీఎంఆర్‌కు ఒకటి.. ప్రైవేటు కొనుగోళ్లకు మరొకటి
- సివిల్ సప్లై ధాన్యానికి బ్యాంకు గ్యారెంటీ చెల్లించాల్సిందే
- సన్నబియ్యంలోనూ 67 శాతం సీఎంఆర్ తప్పనిసరి
- మిల్లర్లకు స్పష్టం చేసిన సివిల్ సప్లై అధికారులు

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): ఇకపై ప్రతి రైస్‌మిల్లు కచ్చితంగా సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)లో భాగస్వామ్యం కావాల్సిందే. కాదు కూడదంటే ఇకపై కుదరదు. ప్రైవేటు వ్యాపారం చేసుకున్నా.. సీఎంఆర్‌లోనూ ఉండాల్సిందే. ఈ మేరకు సీఎంఆర్ నిబంధనల్లో సివిల్ సప్లై కొత్త నిబంధనలను అమలు చేయనున్నది. ఇటీవల విడుదల చేసిన పాక్షిక ప్రొక్యూర్మెంట్ పాలసీలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. మొత్తంగా కాకపోయినా.. మిల్లు కెపాసిటీలో కనీసం 50శాతం సీఎంఆర్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు కొన్ని మిల్లులు పూర్తిగా ప్రైవేటు వ్యాపారం చేసుకుంటూ సీఎంఆర్‌కు నిరాకరించేవి. ఈ సీజన్ నుంచి మిల్లులకు సీఎంఆర్ మినహాయింపులను తొలగించింది.



**బ్యాంకు గ్యారంటీ.. 67శాతం బియ్యం**

కొత్తపాలసీలో సివిల్ సప్లై మిల్లర్లకు షాక్ ఇచ్చింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం కచ్చితంగా సీఎంఆర్ 67శాతం బియ్యం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. మిల్లర్లు మాత్రం సన్న ధాన్యానికి 67శాతం బియ్యం రాబోవని మొత్తుకుంటున్నారు. అయినప్పటికీ సివిల్ సప్లై వారి విజ్ఞప్తులను బుట్టదాఖలు చేస్తూ నిబంధనల ప్రకారం సీఎంఆర్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో మిల్లులు ఎంత ధాన్యం దించుకుంటే అందులో 10-25శాతం వరకు విలువను బ్యాంకు గ్యారంటీగా సివిల్ సప్లైకి అందించాల్సి ఉంటుంది.

**ప్రతి మిల్లు రెండు రికార్డులు**

సీఎంఆర్‌లో అవకతవకలకు చెక్‌పెట్టేవిధంగా సివిల్‌సప్లై సంస్థ కొత్త నిబంధనను అమల్లోకి తీసుకొచ్చింది. ధాన్యం, మిల్లింగ్‌కు సంబంధించి ఇకపై ప్రతి మిల్లు కచ్చితంగా రెండు రికార్డులను నిర్వహించాలని అదేశించింది. ఇందులో ఒక రికార్డులో సివిల్ సప్లై ఇచ్చిన ధాన్యం వివరాలు, సీఎంఆర్ వివరాలను పొందుపరచాలి. మరో రికార్డులో మిల్లులు సొంతంగా చేసుకునే వ్యాపారానికి సంబంధించిన ధాన్యం కొనుగోళ్ల వివరాలను కచ్చితంగా పొందుపరచాలని పేర్కొన్నది.

**పూర్తి పాలసీ ఇంకెప్పుడు...?**

ఒకవైపు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినట్టు ప్రకటించిన సివిల్ సప్లై మరోవైపు కొనుగోళ్లకు సంబంధించి పూర్తిస్థాయి పాలసీని విడుదల చేయకపోవడం గమనార్హం. పూర్తి పాలసీ లేకుండా ఏ విధంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆగస్టులో విడుదల చేయాల్సిన పాలసీని అక్టోబర్ పూర్తవుతున్నా విడుదల చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోళ్లను ఆలస్యం చేసేందుకే పాలసీని తీసుకురావడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలసీ లేకపోవడం వల్ల ఇప్పటి వరకు మిల్లర్లతో ఒప్పందాలు పూర్తి కాలేదు. దీంతో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం ఎక్కడికి పంపిస్తారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.



ఖమ్మం ఏఎంసీకి భారీ సంఖ్యలో వచ్చిన పత్తి బస్తాలు

# తగ్గిన పత్తి ధర

- ఖమ్మంలో కూడబలుక్కొని క్వింటాకు రూ.300 తగ్గింపు
- వరంగల్‌లో రైతుల ఆందోళన.. మార్కెట్లో స్వల్ప ఉద్రిక్తత

ఖమ్మం వ్యవసాయం/కాశీబుగ్గ, అక్టోబర్ 28: ఖమ్మం ఏఎంసీలో ఒక్కసారిగా పత్తి ధర తగ్గింది. సోమవారం 35వేల బస్తాలు వచ్చిన విషయాన్ని గమనించిన ఖరీదుదారులు కూడబలుక్కున్నారు. ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో గరిష్ఠ ధర క్వింటాకు రూ.6,800 పలికింది. అయినప్పటికీ సిండికేట్‌గా మారిన ఖరీదుదారులు ఏకంగా క్వింటాకు రూ.300 తగ్గించి రూ.6500కు దిగువనే ఉంచి పంటను కొనుగోలు చేశారు. ప్రస్తుతం సీసీఐ ధర రూ.7,520గా ఉంది. కానీ ఖరీదుదారులు అమాంతంగా ధర తగ్గించారు. 'ఇంత దారుణంగా ధర తగ్గిస్తారా?' అని కొందరు రైతులు ప్రశ్నిస్తే.. 'ఇష్టమైతే అమ్ముకో.. లేకపోతే ఇంటికి తీసుకపో..' అంటూ బయ్యర్లు సమాధానమిచ్చారు. సీసీఐ అధికారులు కొర్రీలు పెడుతుండడం వల్లనే రైతులు ఖమ్మం ఏఎంసీకి భారీగా పంటను తెస్తున్నారు. సోమవారం వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో 6800ధర పలికింది. దీంతో రైతులు మార్కెట్ అధికారులను నిలదీశారు. స్వల్ప ఉద్రిక్తతతో క్రయవిక్రయాలు కొద్దిసేపు నిలిచిపోయాయి. వెంటనే మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల రంగంలోకి దిగి రైతులకు పత్తి ధరలు తగ్గడంపై వివరించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి గింజలు, కాటన్ బెయిల్స్‌కు ధరలు తగ్గడంతో ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరలకే పత్తి కొనుగోలు చేయాల్సి వస్తుందని తెలిపారు.